క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: జూదం ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి. వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటకాడపల్లె పంచాయతీ తాటిమాకులపల్లెకు సమీపంలో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో జూదం ఆడుతున్న నలుగురు పట్టుబడ్డారు. వీరి నుండి రూ.1,50,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని అవికే నాయక్‌తండా పంచాయతీలోని దేనేనాయక్ తండాకు సమీపంలో కోడిపందెం ఆడుతుండగా సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో కోడిపందెం ఆడుతున్న ముగ్గురు పట్టుబడగా, వీరి నుండి రూ.8,300ల నగదు, రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎక్కడైనా కోడి పందెం, జూదం ఆడినా, నాటుసారా తయారీ, విక్రయాలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మధు, సుబ్బు, నరసింగరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మదనపల్లె సిటీ: మదనపల్లె తాలూకా పెన్షనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ఎన్జీవో హోంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా బీటీ నరసింహులు, కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా కె.నరసింహులును ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌పిళ్ళై ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి నాగరాజు వ్యవహరించారు.

ఫిబ్రవరి 18,19న మదనపల్లెలో ఇజ్‌తిమా

మదనపల్లె సిటీ: స్థానిక కదిరిరోడ్డులోని టిప్పు సుల్తాన్ మైదానంలో ఆదివారం ఇజ్‌తిమా నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, రాయచోటి మౌలానా మసీవుల్లా. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మతగురువులు ఏర్పాట్లపై చర్చించారు. ఫిబ్రవరి 18,19 తేదీల్లో మదనపల్లెలో ఇజ్‌తిమా నిర్వహించనున్నట్లు మతగురువులు తెలిపారు. అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి హాజరుకానున్న వారికి మౌలిక సదుపాయాలు కల్పనకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మతగురువులు న్యాయతుల్లా, హాజీగౌస్‌మోద్దీన్, ఇందాద్, మహమ్మద్‌అలీ, అబ్దుల్‌ఖాద్రీ తదితర మతగురువులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ములకలచెరువు: మండలంలోని మద్దినాయునిపల్లె పంచాయతీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సాయిలీలా, జెడ్పీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి , సర్పంచు క్రిష్ణప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మద్దినాయునిపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పర్యటించనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై అధికారుల సమక్షంలో పరిష్కారం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

సీఐటీయూ రాష్ట్రకమిటీ సభ్యుడిగా వెంకటరామయ్య



పీలేరు : సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పీలేరుకు చెందిన వెంకటరామయ్య ఎన్నికయ్యారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగిన సీఐటీయూ రాష్ట్రమహాసభలలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా పీలేరుకు చెందిన వెంకటరామయ్యను సభ్యుడిగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని తెలిపారు.

తుప్పపడుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు



టి.పసలవాండ్లపల్లె సమీపపొలాల్లో తుప్పపడుతున్న ట్రాన్స్‌ఫార్మర్

గుర్రంకొండ: మండలంలోని టి.పసలవాండ్లపల్లె గ్రామ సమీప పొలాల్లో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అసలే పలువురు రైతులు కొత్తగా బోర్లు వేసుకొని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నెలల తరబడి వేచిచూస్తున్నారు. అలాంటిది ఎంతో విలువైన ట్రాన్స్‌ఫార్మర్లు కేవలం ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతో పొలాల్లో మూలన పడుతున్నాయి. నెలల తరబడి ట్రాన్స్‌ఫార్మర్లు పొలాల్లో పడి ఉండడంతో తుప్పు పట్టిపోయి శిథిలమైపోతున్నాయి. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తెస్తే రైతులు ఉపయోగకరంగా ఉంటుంది.

కాలిబాటలేని ఊరుకు తారురోడ్డు

- గుట్టమీద దళితవాడ ప్రజల నెరవేరిన దశాబ్దాల కల
- రూ.65 లక్షలతో 1.1 కిలోమీటర్ల తారు రోడ్డు
- చురుగ్గా రోడ్డు నిర్మాణ పనులు



గుట్టమీద దళితవాడకు తారురోడ్డు చేపట్టిన దృశ్యం

బి.కొత్తకోట: మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీలో 90 కుటుంబాలు కలిగిన గుట్టమీద దళితవాడ ఉంది. గ్రామం ఏర్పడినప్పటి నుంచి రాకపోకలకు రోడ్డులేదు. ఈ గ్రామం నుంచి శీలంవారిపల్లె- బయ్యప్పగారిపల్లె రహదారికి చేరుకునేందుకు కాలిబాట కూడా లేదు. గత టీడీపీ పాలనలో కాలిబాట కోసం గ్రామస్తుల మధ్య వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ వివాదాలు అధికారుల వద్దకు చేరాయి. అయినా గత ఐదేళ్ల పాలనలో పరిష్కారం లభించలేదు. ఈ సమస్యపై ప్రస్తుత ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి స్పందించారు. తారురోడ్డు మంజూరు కావడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ గ్రామానికి శీలంవారిపల్లెకు వెళ్లే రోడ్డుకు కాకుండా నేరుగా మదనపల్లె-బి.కొత్తకోట మార్గంలో కలిసేలా రోడ్డు పనులు సాగుతున్నాయి. మొగసాలమర్రి నుంచి గట్టమీద దళితవాడకు 1.1 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.65 లక్షలు మంజూరు చేసింది. మొగసాలమర్రి చెరువుకట్టపై నుంచి గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. మట్టిపనిపూర్తవగా, రోడ్డుపై కంకర పరిచారు. దీనిపై తారురోడ్డు పనులు పూర్తి చేయనున్నారు. ఈ రోడ్డుతో గుట్టమీద హరిజనాడకు శాశ్వతంగా రహదారి సమస్య పరిష్కారం అయ్యింది.

రోడ్డు కష్టాలు తీర్చారు

గ్రామానికి రోడ్డులేని ఎన్ని ఇబ్బందులు పడేవాళ్లమో మాకే తెలుసు. కాలిబాట తప్ప రోడ్డులేదు. తాము ఎదుర్కొంటున్న కష్టాలపై ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి స్పందించి తారు రోడ్డు వేయిస్తున్నారు. రోడ్డులేని కష్టాలు తీర్చిన ఆయన రుణం తీర్చుకోలేనిది.



-డి.వెంకటరమణ, గుట్టమీద దళితవాడ

కాకిమారుపల్లి రోడ్డు నిర్మాణ పనులు

పెద్దతిప్పసముద్రం: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మట్టి రోడ్లు తారు రోడ్లుగా రూపుదిద్దుకుంటున్నాయి. ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న రోడ్లకు మహర్దశ పట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లు సుందరంగా తారు రోడ్లుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని కాట్నగల్లు పంచాయతీ కాకిమారుపల్లికి మెయిన్ రోడ్డు నుంచి 700 మీటర్ల మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్చేశారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఈఏపీ-ఏఐఐబీ)ద్వారా రూ. 38.50 లక్షల నిధులతో రోడ్డు పనులు పూర్తి అయినట్లు పీఆర్ జేఈ నిరంజన్‌రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై సర్పంచ్ మిట్టపల్లి అనసూయమ్మ, ఎంపీటీసీ వెంకట్రమణమ్మతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



పూర్తయిన తారు రోడ్డు పనులు

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరించిన మానవత సంస్థ సభ్యులు

పీలేరు : మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ వి. రామచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 2023 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఉపాధ్యాయులు శెట్టిసుబ్రమణ్యం, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ జి.వి. రమణ సహకారంతో క్యాలెండర్లు రూపొందించి పంపిణీ చేసినట్లు తెలిపారు. సమాజ సేవలో మానవత సంస్థ మరింత చురుగ్గా పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వై.వి. రమణ, శెట్టిసుబ్రమణ్యం, సుధాకర్‌బాబు, రహత్‌బాషా, అక్రమ్‌బాషా, నూరుల్లా, కలీముల్లా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెం ఆడుతున్న ఏడుగురు అరెస్టు

తంబళ్లపల్లి: మండలంలో కోడిపందెం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఆర్ఎన్ తండా పంచాయతీ గుడ్లవారిపల్లె సమీపంలో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడుల్లో ఏడు మంది జూదరులను అరెస్టు చేసి రూ.3 వేల నగదు, మూడు కోళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

కలకడ : మండలంలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సిటి స్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మండలంలోని కోన క్రాస్ సమీపంలో నాటు సారా విక్రయిస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది శ్రీనివాసులు, రాజేంద్ర, తాతయ్య, మహబూబ్‌బాషాలతో కలిసి దాడి చేశారు. గుర్రంకొండ మండలం, తుమ్మలగుంది పంచాయతీ టి.గొళ్ళపల్లెకు చెందిన ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు .

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నాగవేణి తెలిపారు. తంబళ్లపల్లె మండలంలో గుండ్లపల్లె వర్కర్ బీసీ-ఎ, మర్రిమాకులపల్లె దివ్యాంగులకు, రెడ్డికోట బీసీ-డీ అభ్యర్థి, మండ్యంవారిపల్లె హెల్పర్, తంబళ్లపల్లె-3, కె.రామిగానిపల్లె హెల్పర్ పోస్టులకు బీసీ-డీ అభ్యర్థులకు రిజర్వేషన్ కేటాయించారన్నారు. పెద్దమండ్యం మండలంలో బండ్రేవు వర్కర్ బీసీ-డి, ఎస్‌వోపల్లె వర్కర్ ఎస్సీ అభ్యర్థులకు, బంకెంగారిపల్లె హెల్పర్ ఎస్సీ, తుస్సావారిపల్లె ఎస్సీ , కుమ్మరిపల్లె, గుడిసెవారిపల్లె హెల్పర్ పోస్టులకు బీసీ-డీ, ములకలచెరువు మండలం కాలువపల్లె హరిజనవాడ వర్కర్ ఎస్సీలకు , ములకలచెరువు ఆర్ఎస్-2 హెల్పర్ బీసీ-డీ, వేపూరికోట వికలాంగులకు ,చంద్రాయుడిపల్లె హెల్పర్ బీసీ-డీ, అగ్రహారం హెల్పర్ ఎస్సీ, పోతుపేట హెల్పర్ ఎస్సీ అభ్యర్థలకు కేటాయించారు. పెద్దతిప్పసముద్రం మండలంలో పీటీయం-1 హెల్పర్ బీసీ-సి, పీటీయం-3 హెల్పర్ దివ్యాంగులకు, కొటాలవాండ్లపల్లె హెల్పర్ ఎస్సీ, గుజ్జులపల్లె హెల్పర్ ఎస్సీ, కందుకూరు-2 బీసీ-ఈ, నారాయణపల్లె హెల్పర్ దివ్యాంగులకు, బెట్టకొండ హెల్పర్ బీసీ-ఏ అభ్యర్థులకు కేటాయించినట్లు తెలిపారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన పది ఉత్తీర్ణత, 25-30 ఏళ్లలోపు వయస్సు , వివాహితులై స్థానికంగా స్థిర నివాసం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నం 9491051641కు సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు : పీలేరు, కేవీపల్లె మండలాల్లో ఖాళీలున్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రెండు మండలాల్లో మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 2, మినీ 3, హెల్పర్స్ పోస్టులు 11 ఖాళీలున్నట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కలికిరి: కలికిరి మండల పరిధిలో ఖాళీవున్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ భారతి ఒక ప్రకటనలో తెలిపారు. వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కలికిరి మండలంలో గుట్టపాళెం అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ-ఈ), మొరంకిందపల్లి మిని అంగన్‌వాడీ కార్యకర్త(ఓసీ), గుట్టపాళెం(బీసీ-డి), కలికిరి-1(బీసీ-డి), టి.సండ్రావారిపల్లి(ఎస్టీ), గడి(ఓసీ), పల్లవోలు(బీసీ-బి), కొమ్మేపల్లి(వీహెచ్) అంగన్‌వాడీ ఆయా పోస్టులు వున్నాయని తెలిపారు.

నిధుల వినియోగంపై ఆడిట్

బి.కొత్తకోట: నగర పంచాయతీలో గత ఆర్థిక సంవత్సరంలో నిధుల వినియోగంపై ఆడిట్ మొదలైంది. 2021-22లో నగర పంచాయతీకి లభించిన సాధారణ ఆదాయం, వివిధ పథకాలు, కార్యక్రమాలకు మంజూరైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి ఎంత మొత్తం ఖర్చు చేశారు, దేనికి ఎంత నిధులు వినియోగించారు, నిధుల నిల్వ తదితర అంశాలపై సమగ్రంగా రికార్డులు పరిశీలించి ఆడిట్ చేయనున్నారు.

సాయిబాబా మందిరంలో దీపోత్సవం



మదనపల్లె సిటీ: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా స్థానిక బర్మావీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా మందిరంలో ఆదివారం దీపోత్సవం నిర్వహించారు. శాంతారాంస్వామి ప్రవచనాలు వినిపించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుకోవాలనే వారికి ఓపెన్ స్కూల్ వరం



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకుడు అక్బర్‌అలీ

మదనపల్లె సిటీ: వివిధ కారణాలతో చదువు మానేసిన వారు మళ్లీ చదువుకోవడానికి ఓపెన్ స్కూల్ విధానం వరమని ఓపెన్ స్కూల్ రాష్ట్ర పరిశీలకుడు అక్బర్‌అలీ అన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఓపెన్‌స్కూల్ కాంట్రాక్టు తరగతులను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విద్యావిధానాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఏడాది మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టడీ మెటీరియల్‌తో పాటు కాంట్రాక్టు తరగతుల వల్ల మంచి ఫలితాలు వస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓపన్‌స్కూల్ జిల్లా సమన్వయకర్త సుబ్బారెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు కలికిరిలో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

కలికిరి: రాజంపేట పార్లమెంట్ సభ్యులు పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈద్గా ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలం పరిశీలన చేస్తారు అలాగే మెయిన్ బజారులోని జామియా మసీదు, రెడ్డివారిపల్లి మసీదు, ఏఎస్ఆర్ కాలనిలోని మదీన మసీదు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధిలోని మక్కా మసీదు, ఇందిరమ్మకాలనిలోని మహమ్మద్ ఇమామ్ మసీదు, బీడీ కాలని, క్రాస్ రోడ్డులోని ఈద్గా మసీదు, రాజువారిపల్లి, కొర్లకుంట, చెరువుముందరపల్లి మసీదుల అభివృద్ధికి ఎంపీ నిధుల మంజూరు, అభివృద్ధిపై ఆయా కమిటీల సమావేశమవుతారన్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహావిష్కరణ, సిఎల్ఆర్‌సీ సమీపం, ఏఎస్ఆర్‌కాలనీ, ఇందిరమ్మకాలనీల్లో నూతన తాగునీటి శుద్ధి యంత్రాల ఏర్పాటుకు శంకుస్థాపన, 3.30 గంటలకు మండల కార్యకర్తల సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



బెస్త కులస్తుల ఐక్యత చాటుతున్న సంక్షేమ సంఘం సభ్యులు

మదనపల్లె : బెస్త కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే దిశగా రాష్ట్రంలోని అన్ని పార్టీలు చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా బెస్త సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రీరస్తు ఫంక్షన్‌హాల్‌లో జిల్లా బెస్త సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని బెస్త కులస్తులందరితో కలిసి బహిరంగ సమావేశం ఏర్పాటు చేద్దామని, అందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించుకున్నారు. బెస్తల వృత్తి, ఉపాధిని కాపాడుకునేందుకు మత్స్య సహకార సొసైటీలలో బెస్తవారికి అధిక సంఖ్యలో ప్రాతినిధ్యం కల్పించి, సొసైటీల బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ జిల్లాల్లో బెస్త కులస్తులకు హక్కుల కోసం పోరాడేందుకు, శాసనసభలో వారి గొంతుక వినిపించేందుకు ఒక ఎమ్మెల్యే సీటును కేటాయించాలని డిమాండ్ చేశారు. 217 జీఓను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మడితం రమణ, బీసీ రెడ్డెప్ప, కృష్ణమూర్తి, నారద, నాగభూషణం, వేమనారాయణ, మల్లప్ప, రూపేష్, సుధాకర్, రెడ్డెప్ప, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

విలేజ్ ప్లాన్‌తో 80 ఏళ్ల రోడ్డు సమస్య పరిష్కారం



బుడతన రాళ్ల దళితవాడకు పక్కా రోడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కురబలకోట: కురబలకోట మండలంలోని బుడతనరాళ్ల దళితవాడ వాసుల 80 ఏళ్ల రోడ్డు సమస్యను విలేజ్ ప్లాన్ (గ్రామ పఠం) పరిష్కరించింది. ఇది వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది నిజం. ఈ ఊరు ఏర్పాటైనప్పటి నుంచి రోడ్డులేదు. కాలిదారిన రాకపోకలు సాగించేవారు. ఇన్నేళ్లుగా ఎందరో రోడ్డు సమస్యను పరిష్కరించాలని చూసినా సఫలం కాలేదు. గత ప్రభుత్వ పాలకులు కూడా చొరవ చూపలేదు. ఇటీవల ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆ ఊరికి గడప గడప కార్యక్రమానికి వెళ్లారు. దళితుల సమస్యపై స్పందించారు. రోడ్డు వేయాలని స్థానిక నాయకులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, తహసీల్దారు ఎం. భీమేశ్వరరావుకు సూచించారు. దీంతో వారు రికార్డు పరిశీలించారు. విలేజ్ ప్లాన్‌లో కడప రోడ్డు హైవే నుంచి బుడతన రాళ్ల హరిజన వాడ వరకు బండి బాట ఉన్నట్లు నమోదై ఉంది. దీంతో రోడ్డుకు భూమి వదలడానికి అభ్యంతరం చెప్పిన రైతుకు ఈ విలేజ్ ప్లాన్ విషయాన్ని వివరించారు. మొదటి మొండికేసినా చివరకు రోడ్డుకు భూమి వదలక తప్పదలేదు. రెవెన్యూ రికార్డులో రోడ్డు ప్లాన్ ఉన్నా ఇన్నేళ్లుగా అధికారులు, నాయకులు కాలయాపన చేయడం ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది. రెండు రోజులుగా జేసీబీతో మట్టి రోడ్డు పనులు పూర్తి చేశారు. ఎన్నాళ్లగానో ఎదురు చూసిన రోడ్డు సమస్యను విలేజ్ ప్లాన్ ఆధారంగా సామరస్యంగా పరిష్కారం కావడంతో గ్రామస్తులు, నాయకులు, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో తారు రోడ్డు కూడా వేయడానికి ప్రతిపాదనలు పంపినట్లు జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీపీ బి దస్తగిరి తెలిపారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

మదనపల్లె సిటీ: విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఉప విద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప అన్నారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో హాస్టల్ విద్యార్థులకు పదో తరగతి మోడల్ పేపర్ బుక్‌లెట్స్‌ను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తాను హాస్టల్‌లో చదివి ఉన్నత స్థాయికి ఎదిగినట్లు పేర్కొన్నారు. మారిన ఎగ్జామినేషన్‌కు అనుగుణంగా మోడల్ పేపర్లు తయారు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. అందరూ కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర కౌన్సిలర్లు రవిప్రకాష్, పురం వెంకటరమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'బీటీ' ఆస్తులు అన్యాక్రాంతం అవాస్తవం

– కరస్పాండెంట్ డాక్టర్.వైఎస్.మునిరత్నం



మాట్లాడుతున్న బీటీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వైఎస్ మునిరత్నం

మదనపల్లె : బిసెంట్ సెంచునరీ ట్రస్ట్‌కు సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఆరోపణల్లో వాస్తవం లేదని కరస్పాండెంట్ డాక్టర్ వైఎస్ మునిరత్నం తెలిపారు. ఆదివారం బీటీ కళాశాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీటీ కళాశాలకు చెందిన పీజీ హాస్టల్ అపరిశుభ్రంగా తయారై, అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్న నేపథ్యంలో అడ్డుకట్ట వేయాలని తలచామన్నారు. అందులో భాగంగా హాస్టల్‌కు పక్కనే ఉన్న వరాల ఆంజనేయస్వామి కమిటీ సభ్యులను సంప్రదించి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగించుకోవాల్సిందిగా కోరామన్నారు. వారు అందులో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసేందుకు వినియోగించుకుంటామని, బీసీటీ ట్రస్ట్ సభ్యులు ఎప్పుడు కోరితే అప్పుడు ఖాళీ చేస్తామని చెప్పడంతో వారికి అనుమతి ఇచ్చామన్నారు. దీనిని కొందరు వ్యక్తులు కావాలనే దురుద్దేశంతో ఏవేవో అసత్యకథనాలు, అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారన్నారు. బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేయడంలో పరిరక్షణ సమితి తమ వంతు కర్తవ్యాన్ని సమర్థవంతంగా నెరవేర్చినట్లే.. బీసీటీ ట్రస్ట్ ఆస్తులను పరిరక్షించడంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. వరాల ఆంజనేయస్వామి ఆలయచైర్మన్ దివాకర్ మాట్లాడుతూ.. బీటీ కళాశాల కరస్పాండెంట్ కోరిక ప్రకారం ఆలయ సమీప ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటాయనే ఉద్దేశంతో భూమిని శుభ్రం చేశామన్నారు. శుభ్రం చేసిన స్థలం ఎప్పటికీ బీసీటీ ట్రస్ట్‌దేనని, ఆలయానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో బీటీ కళాశాల పరిరక్షణ సమితి కమిటీ సభ్యులు ఆకులకిరణ్‌కుమార్, హిందూచైతన్యవేదిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అద్దె గదులకు దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు రూరల్: ఆర్టీసీలో ఖాళీ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు బస్టాండ్‌లో 5 పక్కా షాపులు, 28 ఓపెన్ స్పేస్ షాపులను బేకరీ, ఫ్యాన్సీ, కూల్ డ్రింక్స్, స్వీట్ షాప్స్, చాట్‌బండార్, ఫ్లవర్ స్టాల్, షామియానా డెకరేషన్ సప్లయర్స్, రెడీమేడ్ గ్యార్మెంట్స్, పూలు, పండ్లు, జిరాక్స్, ఇంటర్నెట్, ఎగ్‌మార్ట్, టీ, కాఫీ, స్నాక్స్ లాంటి వ్యాపారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే కలికిరి బస్టాండులో 3 పక్కా షాపులు, 2 ఓపెన్ షాపులు, కలకడలో ఒక ఓపెన్ స్పేస్ అద్దెకు ఇవ్వడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు కోరారు. ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

● జనవాసాల్లోకి నెమళ్లు





వెంగన్నగారిపల్లెలో ఇంటి పరిసర ప్రాంతంలోకి వచ్చిన నెమళి, బురకాయలకోటలో రోడ్డు పక్కన ఇలా..

ములకలచెరువు: మండలంలోని బురకాయలకోట, మద్దినాయునిపల్లెలో జనవాసాల్లోకి ఆదివారం నెమళ్లు వచ్చాయి. ఈ రెండు గ్రామాల్లో నెమళ్లు సంచరిస్తూ స్థానికుల్ని ఆహ్లాదపరిచాయి. చుట్టు పక్కల ఉన్న అటవి ప్రాంతాల్లో నెమళ్లు ఎక్కువగా ఉండడంతో గ్రామాల్లోకి అప్పుడప్పుడు వస్తుంటాయని స్థానికులు అంటున్నారు. చాలా వరకు నెమళ్లు రోడ్లను దాటుతూ మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు. అటవీశాఖ అధికారులు నెమళ్ల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

● రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

● అ'పూర్వ' కలయిక



పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్లో 2007-2008 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సందడి చేశారు. 15 ఏళ్ళ తరువాత 60 మంది విద్యార్థులు ఒకే చోట కలసి ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. విద్యా బుద్ధులు నేర్చుకున్న పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో కలసి కట్టుగా తమ వంతు సహకారం అందించాలని వారంతా తీర్మానించుకున్నారు.